## క్లుప్తంగా

### ఎంపీపీని పరామర్శించిన ఎమ్మెల్యే శివకుమార్



**తెనాలి టౌన్:** ఇటీవల అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులును ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ బుధవారం పరామర్శించారు. ఎంపీపీ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

### నూతన కార్యవర్గానికి సన్మానం

**తెనాలి టౌన్:** పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో నూతనంగా ఎన్నికైన నాయకులను పూల మాలలు, శాలువాలతో బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ సత్కరించారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్‌గా కఠారి వాసుదేవనాయుడు, పట్టణ అధ్యక్షుడిగా అడపా సంపత్‌రాయుడు, తెనాలి రూరల్ మండల అధ్యక్షుడిగా నందకిషోర్, కొల్లిపర అధ్యక్షుడిగా మునగాల కృష్ణమూర్తి ఎన్నికైనట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు గాజుల వెంకయ్యానాయుడు, బి.కనకదుర్గ, మైలా హరికృష్ణ, మంచాల రత్నరాజు, జ్ఞాన కళావతి, ప్రశాంతి, పి.వాసు, కొత్తపల్లి రమేష్, కె.సతీష్ పాల్గొన్నారు.

### సమ సమాజ స్థాపనకు అంబేడ్కర్ కృషి



**గుంటూరు మెడికల్:** సమ సమాజ స్థాపన కోసం అంబేడ్కర్ కృషి చేశారని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. సామాజిక సమాజ సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం హిందూ కళాశాలలో వివిధ పోటీల్లో గెలుపొందిన ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థినులకు బహుమతులను అందచేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలాన్ని ప్రజలంతా అలవర్చుకోవాలని సూచించారు. ఈ నెల 9 నుంచి 19 వరకు విద్యార్థినులకు పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

### హెల్త్‌కేర్ కోర్సులో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని కీట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుద్యోగులకు హెల్త్‌కేర్ కోర్సులో ఉచిత శిక్షణఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి హరిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ విద్యార్హతతో 19 నుంచి 30 ఏళ్ల వయసు ఉన్న అభ్యర్థులకు నందిగామలో 60 రోజుల పాటు ఉచిత భోజన, వసతి సదుపాయంతో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. హెల్త్‌కేర్, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై శిక్షణతో పాటు కార్పొరేట్ హాస్పిటల్స్, హెల్త్‌కేర్ సంస్థల్లో నెలకు రూ.20 వేల కనీస వేతనంపై ఉద్యోగాన్ని కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 90004 87423లో సంప్రదించాలని సూచించారు.

### 22న కోటి ఒక్క లింగాల శివాలయం ప్రారంభం

**పాత గుంటూరు:** ఫిరంగిపురం మండలం వేమవరంలో ఈ నెల 22న కోటి ఒక్క లింగాల శివాలయ ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తున్నామని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు స్వామి జ్ఞానప్రసన్న గిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు ఎనిమిది విస్తీర్ణంలో 101 అడుగుల మహా శివలింగంతోపాటు 50 అడుగుల మహానందీశ్వరుడు, కోటి ఒక్క లింగాలతో దేవాలయాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. ఇందులో హుండీ, అభిషేకం టికెట్లు, వీఐపీ సౌకర్యాలు ఉండవని వెల్లడించారు. అయోధ్యలోని రామ మందిర ముహూర్తానికే ఆలయం ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దేవాలయానికి అనుబంధంగా భవిష్యత్తులో ఎన్నో సేవలు అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో ఉన్నామని పేర్కొన్నారు. ఈ మహా క్రతువులో ఎందరో పుణ్యాత్ములు భాగస్వాములయ్యారని తెలిపారు. మంత్రులు, శాసన సభ్యులు, ప్రముఖుల్ని ప్రారంభోత్సవానికి ఆహ్వానించామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులంతా పాల్గొనాలని స్వామి జ్ఞానప్రసన్న గిరి కోరారు.

# శరవేగంగా 'క్రిటికల్ కేర్' పనులు

- రూ.45 కోట్లతో నిర్మాణం
- 15 నెలల్లో పూర్తి లక్ష్యం



యూనిట్ నిర్మాణం కోసం జరుగుతున్న మట్టి పనులు



చదును పనులు చేస్తున్న కార్మికులు

**తెనాలిఅర్బన్:** స్థానిక జిల్లా వైద్యశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ ఈప్రాంతానికి మణిహారంగా మారనుంది. ఇప్పటి వరకు అత్యవసర పరిస్థితి ఉన్న రోగులు గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాల్సి ఉంది. దీని నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి వస్తే తెనాలి డివిజన్‌లోని పేద ప్రజలకు జిల్లా వైద్యశాలలోనే అత్యవసర సేవలు అందే అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం వంద పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌ను రూ.45 కోట్లతో నిర్మిస్తున్నారు. అంటే తెనాలి జిల్లా వైద్యశాల(జిల్లా వైద్యశాల-200, తల్లి పిల్లల వైద్యశాల-100, క్రిటికల్ కేర్ యూనిట్-100 పడకలు కలుపుకుని) 400 పడకలతో అతి పెద్ద వైద్యశాలగా రూపుదిద్దుకుంటున్నట్లు అయింది.

**క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం..**

తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో నూతనంగా క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మిస్తున్నారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం రూ.45 కోట్ల నిధులను వెచ్చించింది. వీటిలో రూ.22 కోట్లు భవన నిర్మాణ పనులకు కేటాయించగా, మిగిలిన నిధులు ఆపరేషన్ థియేటర్, క్యాజువాలిటీలలో వస్తువుల కొనుగోలు, వార్డులలో మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా నాలుగు ఫ్లోర్‌లతో దీనిని నిర్మించనున్నారు. నెల క్రితం వీటి పనులు ప్రారంభించారు. మట్టిని తవ్వి అక్కడ ఫ్లోరింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

**క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఉండే విభాగాలు ఇవి.**

క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ) విభాగాన్ని 20 పడకలతో (చిన్నపిల్లలకు అవసరమైన నాలుగు బెడ్‌లు కలిపి) ఏర్పాటు చేయనున్నారు. అలాగే హైడిఫినిషిన్ యూనిట్(హెచ్‌డీయూ)-20 పడకలు, ఐసోలేషన్ వార్డు-30 పడకలతో, ఐసోలేషన్ గదులు-12, డయాలసిస్ బెడ్‌లు-4, ఎంసీహెచ్(బాలింతలకు)-4 బెడ్‌లు, అత్యవసర విభాగం-10 పడకలతో నిర్మించనున్నారు. ఇవి కాకుండా మూడో అంతస్తులో రెండు ఆపరేషన్ థియేటర్‌లను ఏర్పాటు చేయనున్నారు.

**అందుబాటులోకి రానున్న వైద్యసేవలు.**

తెనాలి జిల్లా వైద్యశాలలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, అప్తమాలజీ, ఈఎన్‌టీ, సైక్రాటిక్, డెంటల్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఆవరణలోని తల్లి పిల్లల వైద్యశాలలో మహిళలకు సంబంధించిన (గైనిక్) సేవలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఇటీవల జిల్లా వైద్యశాల ఆవరణలో నిర్మించిన సత్వర చికిత్స కేంద్రం ద్వారా పుట్టుకతో చిన్నారులకు వచ్చే వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ ద్వారా గతంలో ఉన్న జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరి, అనస్తీషియాతో పాటు న్యూరో సర్జరి, కార్డియాలజీ,వంటి సేవలు అదనంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల తెనాలి డివిజన్‌లోని పేద ప్రజలకు మరిన్ని వైద్య సేవలు ప్రభుత్వ వైద్యశాలలో అందే అవకాశం ఉంది.

> **15 నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తాం**
>
> తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో రూ.45 కోట్లతో అత్యధునిక క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మిస్తున్నారు. నెల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. 15 నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.
>
> -కె.వెంకటరత్నం, డీఈ, ఏపీఎంఎస్ఐడీసీ, గుంటూరు

## ప్రేక్షకులను అలరిస్తున్న నాటికలు



జరుగుతున్న కథ నాటికలోని సన్నివేశం

**కొల్లిపర:** సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని కొల్లిపరలోని అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలోని అన్నపరెడ్డి శివరామిరెడ్డి స్మారక కళా ప్రాంగణంలో ప్రదర్శిస్తున్న నాటికలు అలరిస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన బుల్లితెర నటులు శాస్త్రి, మల్లాది భాస్కర్ ప్రదర్శించిన వెన్నెలొచ్చింది హాస్య నాటిక, గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ ప్రదర్శించిన నాన్న నేనొచ్చేస్తా, తాడేపల్లి అరవింద ఆర్ట్స్ ప్రదర్శించిన జరుగుతున్న కథ నాటికలు ప్రేక్షకులను అలరించాయి. కళాకారులను శ్రీ కళానిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆరిమండ శివశంకర్‌రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి, అన్నవరపు రమేష్, గ్రామ ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ గుదిబండి చిన వెంకటరెడ్డి, వంగా లక్ష్మారెడ్డి, బొల్లిముంత కృష్ణ, కల్లం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, జొన్నల పేరెడ్డి, ఆరిమండ బసవకుటుంబరెడ్డి, బొంతు పోతిరెడ్డి పాల్గొన్నారు.

## తెనాలి సీటు 'ఆలపాటి'కే ఇవ్వాలి

- మనోహర్ వేరే నియోజకవర్గం చూసుకోవాలి
- టీడీపీ సర్వసభ్య సమావేశంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు
- పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని ఇద్దరు తెలుగు తమ్ముళ్ల హైడ్రామా



నినాదాలు చేస్తున్న టీడీపీ నాయకులు

**తెనాలిరూరల్:** టీడీపీతో జనసేన పార్టీ పొత్తును తాము ఆహ్వానిస్తున్నామని, అయితే తెనాలి సీటు మాత్రం ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కే ఇవ్వాలని తెలుగు తమ్ముళ్లు డిమాండ్ చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో తెనాలి సీటు జనసేన పార్టీకే ఇస్తున్నారని, పొత్తులో భాగంగా ఆ పార్టీ నేత నాదెండ్ల మనోహర్‌కు తెనాలి సీటు ఖరారైందన్న వార్తల నేపథ్యంలో టీడీపీ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఇక్కడి నాజరుపేట ఎన్‌వీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు మహమ్మద్ ఖుద్దూస్ మాట్లాడుతూ జనసేనతో పొత్తుకుంటే అన్ని సర్వేలు రాజాకే అనుకూలంగా ఉన్నాయని, తక్కువ ఓటింగ్ శాతం కలిగిన జనసేన అభ్యర్థికన్నా రాజాకు టికెట్ ఇవ్వడమే సముచితమన్నారు. పొత్తు ధర్మాన్ని కాదని జనసేన పార్టీ వాళ్లు కావాలనే దుష్ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ తమ పార్టీకి బలమున్న వేరే నియోజకవర్గాన్ని చూసుకోవాలన్నారు. టీడీపీ అధిష్టానం ఆలపాటికే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు, వంగా సాంబిరెడ్డి, మంగమూరి హరి, రావి చిన్ని నిమ్మకాయల రమ్య, జొన్నాదుల మహేష్, బొబ్బిళ్లపాటి ప్రసాద్‌బాబు, మాదల కోటేశ్వరరావు, మార్కండేయులు, కొండా రమాదేవి, తాడిబోయిన శ్రీనివాసరావు తదితరలు మాట్లాడారు. సమావేశం సందర్భంగా టీడీపీ కార్యకర్తలు షావుల్, వేణు ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న నాయకులు అడ్డుకున్నారు.

## అంగరంగ వైభవంగా ఆటల పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

**తాడేపల్లిరూరల్:** దుగ్గిరాల గ్రామ పరిధిలో ఆడుదాం ఆంధ్రా ఇది అందరి ఆట పోటీల కార్యక్రమాన్ని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ బుధవారం ప్రారంభించారు. జాతీయ జెండా ఆవిష్కరించి, క్రీడాకారులకు పరిచయం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్థాయిలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొనే విధంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నారని, దీనిలో భాగంగా ఇప్పటికే దుగ్గిరాల మండలంలో 18 గ్రామాల్లో కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్‌తో పాటు సంప్రదాయ ఆటల పోటీలను విడివిడిగా నిర్వహించారని, గ్రామ స్థాయిలో గెలుపొందిన వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తు ఉచితంగా డ్రెస్‌తో పాటు ఆట వస్తువులను అందజేసి, మండల స్థాయిలో ఆడేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల, రేవేంద్రపాడు, ఈమని పాఠశాలల్లో ఈ మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవరపల్లి వీరయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.రజనీకాంత్, మండల అధ్యక్షుడు ఎస్.రత్నం పాల్గొన్నారు.

**నైపుణ్యాలు వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా**

**తాడికొండ:** యువతలో అంతర్లీనంగా దాగిఉన్న క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పుల శేషగిరిరావు అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా తుళ్లూరులో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం, దేహదారుఢ్యం పెంపొందించుకోవచ్చని, మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన టీమ్‌లు జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా తమ సత్తాచాటి ప్రతిభతో విజయం సాధించాలన్నారు. ఈ సందర్భంగా విజేతలకు క్రికెట్ కిట్లును అందజేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు బత్తుల కిషోర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు, ఎంపీడీఓ బి.శివన్నారాయణ పాల్గొన్నారు.

### జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు

**తెనాలిఅర్బన్:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు దివి కిషోర్ కుమార్ సూచించారు. చినరావూరులోని సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు వారి ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వీటిని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. జనరల్ ఓపీ-97, గైనకాలజి -13, జనరల్ మెడిసిన్-58, అప్తమాలజీ -38 మందికి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ పి ఉషారాణి, డాక్టర్ లిఖిత, డాక్టర్ టి.వినిల్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

**తెనాలిరూరల్:** ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం... తెనాలి వైపు నుంచి మంగళవారం రాత్రి పొద్దుపోయాక నందివెలుగు ప్రధాన కూడలి వైపు వెళుతున్న ఆటోను ఎదురుగా వచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న కొలకలూరుకు చెందిన గుంటూరు వెంకాయమ్మ(68) తీవ్రంగా గాయపడగా, ఆటో డ్రైవర్ స్వల్ప గాయాలపాలయ్యాడు. వెంకాయమ్మను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు.

### మహాప్రస్థానానికి విరాళం

**గుంటూరు ఎడ్యుకేషన్:** బొంగరాలబీడులోని మహాప్రస్థానంలో సదుపాయాల కల్పనకు దాతలు రూ.2,01,116 విరాళాన్ని అందజేశారు. కమిటీ సభ్యులకు దాతలు చెరుకూరి చినమాల కొండయ్య సతీమణి చెన్నమ్మ, శ్రీనివాసరావు సతీమణి శ్రీలక్ష్మి సంబంధిత మొత్తాన్ని బుధవారం చెక్కు రూపంలో ఇచ్చారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు యార్లగడ్డ అంకమ్మ చౌదరి మాట్లాడుతూ మహా ప్రస్థానం అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి లంకా విజయసారథి, సభ్యులు కల్లూరు రమణయ్య, జంగాపల్లి పార్థసారథి, ధనియాల గాంధీ, కూనల మాలకొండయ్య పాల్గొన్నారు.

### వాలీబాల్ పోటీల్లో వేజండ్ల హైస్కూల్ జట్టు ప్రతిభ

**వేజండ్ల (చేబ్రోలు):** వాలీబాల్ పోటీల్లో వేజండ్ల హైస్కూల్ బాలికల జట్టు ప్రతిభ చూపింది. సంక్రాంతి సంబరాల సందర్భంగా వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులో 14 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రస్థాయి మహిళల వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను హెచ్ఎం టి. విజయశ్రీ, పీఈటీ తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

### భళా.. బాల గాయకా !



ఫాస్టెస్ట్ కిడ్ రికార్డుతో తన్విక్ వేదాన్ష్‌రెడ్డి

**గుంటూరు ఎడ్యుకేషన్:** గుంటూరు నగరానికి చెందిన ఓ చిన్నారి నాలుగేళ్ల చిరుప్రాయంలోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కాడు. కర్ణాటక సంగీతంలో 12 సరళీ స్వరాల్ని ఐదు నిమిషాల 21 సెకండ్లలో ఆలపించడం ద్వారా అతి చిన్న వయసులో ఫాస్టెస్ట్ కిడ్‌గా నిలిచి, సరికొత్త రికార్డు నెలకొల్పాడు. నగరంలోని దేవాపురానికి చెందిన మాలపాటి విష్ణు ప్రణీత్‌రెడ్డి, ప్రణతి తనయుడు తన్విక్ వేదాన్ష్ రెడ్డి కర్ణాటక సంగీతం వోకల్ (గాత్రం) సాధన చేస్తున్నాడు. చిరుప్రాయంలోనే అతనికి గల ఆసక్తితో తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ఇటీవల కర్ణాటక సంగీతంలో 12 సరళీ స్వరాలను అతి తక్కువ సమయంలోనే ఆలపించిన చిన్నారిగా నిలిచిన తన్విక్ వేదాన్ష్ రెడ్డికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించిన నిర్వాహకులు ఫాస్టెస్ట్ కిడ్ రికార్డును ప్రదానం చేశారు. దీంతో పాటు బంగారు పతకం, సర్టిఫికెట్‌ను అందజేశారు.

## అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

**తెనాలి:** విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాల్సిందిగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు విజ్ఞప్తి చేశారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో ఈనెల 19వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు సామాజిక న్యాయ మహాశిల్పం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు కళెవరపు దేవయ్య మాట్లాడుతూ ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, బలహీనవర్గాల ఆశాజ్యోతి, ప్రజాహక్కుల నాయకుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని పీఠంతో కలిపి రాష్ట్రప్రభుత్వం విజయవాడలోని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మన్నవ శాంతిశ్రీ మాట్లాడుతూ స్త్రీ విముక్తి ప్రదాత, కులనిర్మూలనతోనే దేశాభివృద్ధి జరుగుతుందని చెప్పిన గొప్ప విద్యావంతుడు డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మన జాతికి అంకితం చేస్తున్నట్టు తెలిపారు. ఈ వేడుకకు పార్టీ నేతలు, అంబేడ్కర్‌వాదులు, అభ్యుదయ భావాలు కలిగిన మేధావులు, ప్రజాసంఘాలు, కార్యకర్తలు, భౌతికవాదులు, కళాకారులు, రాజకీయ నాయకులు అన్ని ప్రాంతాల నుంచి తరలిరావాలని నాయకులు కోరారు. కౌన్సిలర్లు దాసరి వీరవసంతరావు, కొమరాబత్తుని జయపాల్, అక్కిదాసు కిరణ్‌కుమార్, గొరిగపూడి బాలరాజు, కాకి మనోజ్, వేముల మహేష్, పినపాటి అనిల్, ఎం.రాజు, కె.కిషోర్‌బాబు, పి.సునీల్, సువర్ణబాబు, బి.బాజీ, బి.నాని, విజయ్ పాల్గొన్నారు.

## కంచర్లపాలెంలో రోడ్డు ఆక్రమణ

**ఎమ్మెల్యే శివకుమార్‌కు బాధితుల ఫిర్యాదు**



కట్టిన గోడకు పచ్చరంగు

**కంచర్లపాలెం(తెనాలి):** గ్రామంలో సిమెంటు రోడ్డు ఆక్రమణపై స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు చుక్కపల్లి లలితా ప్రసన్న, జగన్, ప్రమీల, ఎం.అంజలీదేవి బుధవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. పంచాయతీలో నాలుగో వార్డులో యాభై ఏళ్లకు పైగా ఉన్న రోడ్డుకు పక్కనే ఒకరు గతంలోనే ఇంటిగోడ నిర్మించుకున్నారు. ఆ ప్రదేశానికి ఎదురుగా రోడ్డుకు మరోవైపున చుక్కపల్లి శరత్‌కుమార్ ఆక్రమించారని ఆరోపించారు. మొత్తం 9-10 అడుగుల రోడ్డులో మూడునెలల క్రితం నాలుగు అడుగుల వరకు పగులగొట్టి వారి స్థలంలో కలిపేసుకున్నారు. గోడ నిర్మించి, పసుపుపచ్చ రంగు వేశారు. దీనితో ఆ రోడ్డు మూసుకుపోయింది. వాహనాల రాకపోకలకు అవకాశం లేదు.

రోడ్డు ఆక్రమణపై పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఫలితం లేకుండా పోయిందని ప్రమీల చెప్పారు. తెనాలి సబ్‌కలెక్టర్‌కు, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదుచేయటంతో విచారించి తగిన చర్యలు తీసుకోమని పంచాయతీకి సూచించారు. అయినాసరే, పంచాయతీ అధికారి ఏమాత్రం సహకరించకపోగా, ఆక్రమణదారులకే వత్తాసు పలుకుతున్నారని జగన్ ఆరోపించారు. వేమూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత పలుకుబడితో పంచాయతీ అధికారి సహకరించటం లేదన్నారు. ఈ విషయాలన్నీ స్థానిక ఎమ్మెల్యే శివకుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో పరిశీలించి న్యాయం చేస్తానని హామీనిచ్చారు.

## అందుబాటులో రైల్వే పశ్చిమ విభాగం సేవలు

**నూతన ప్లాట్‌ఫారం వైపు రిజర్వేషన్ కౌంటర్లు**



అవార్డులు అందుకున్న అధికారులతో డీఆర్ఎం రామకృష్ణ, ఏడీఆర్ఎం సైమన్ తదితరులు

**లక్ష్మీపురం:** గుంటూరు రైల్వే పశ్చిమ విభాగం అరండల్‌పేట వైపు 8వ ప్లాట్‌ఫారం నిర్మాణ పనుల్ని పూర్తి చేసి ప్రయాణికులకు సేవల్ని ప్రారంభించినట్లు డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ బుధవారం వెల్లడించారు. నూతన ప్లాట్‌ఫారం వైపు కౌంటర్లను, రిజర్వేషన్ కార్యాలయం స్థలాన్ని మార్చినట్లు చెప్పారు. టికెట్లను పొందడానికి పశ్చిమం అరండల్‌పేట వైపు ఐదు బుకింగ్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. స్టేషన్‌లోని వివిధ ప్లాట్ ఫారాలకు చేరుకోవడానికి ప్రయాణికులు లిఫ్ట్, ఎఫ్‌వోబీ సబ్‌వేలను ఉపయోగించవచ్చని సూచించారు. పశ్చిమ విభాగం అరండల్‌పేట వైపు కూడా సేవల్ని ప్రారంభించడం వల్ల నగరవాసులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రైల్వే స్టేషన్‌లో పశ్చిమ నుంచి తూర్పు విభాగం వైపునకు వచ్చేందుకు ప్రయాణికులకు సౌకర్యాలు కూడా కల్పించామన్నారు. అరండల్‌పేట వైపు కూడా స్టేషన్‌లోకి రావచ్చని ఆయన తెలియజేశారు.

**13 మందికి రైల్ సేవా పురస్కార్ అవార్డులు**

దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో వివిధ విభాగాల అధికారులు రైల్ సేవా పురస్కార్ అవార్డులు దక్కించుకోవడం అభినందనీయమని డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని తన కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. 2023లో ప్రతిభను కనబర్చినందుకు గానూ 13 మంది 68వ రైల్వే వీక్ (రైల్ సేవా పురస్కార్ ) అవార్డులను అందుకున్నట్లు తెలిపారు. ఇందులోఓ ప్రధానంగా ఏడీఎఫ్ఎం-1 గుంటూరు ఎం.షణ్ముఖేశ్వరరావు, డివిజనల్ రైల్వే హాస్పిటల్ ఏసీఎంఎస్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్‌లతో పాటు మరో 11 మంది సంబంధిత విభాగాధికారులు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రభాకర్ రాజు, సీనియర్ డీపీవో షాహబాజ్ హనూర్ పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన

- పార్టీల ప్రతినిధుల సమావేశంలో కమిషనర్ కీర్తి చేకూరి
- ఓటర్ల తుది జాబితా 22న విడుదల



మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

**నెహ్రూనగర్:** ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌వో కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ -2024పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుపై చర్యలు తీసుకోవడానికి ఏఈల వారీగా కేంద్రాల్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. ఓటర్ల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై వివిధ రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి గత డిసెంబర్ 9 నాటికి అందిన ఫిర్యాదులు, అభ్యంతరాల్ని పరిష్కరించామని పేర్కొన్నారు. తుది జాబితా ఈ నెల 22న కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేస్తుందని వెల్లడించారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌వో, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, ఏఈఆర్‌వోలు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు సాంబశివరావు, పద్మ, డెప్యూటీ తహసీల్దార్ బి.భాస్కర్, టీడీపీ నుంచి ఓంకార్, వైఎస్సార్ సీపీ నుంచి డి.జానీ బాషా, బీఎస్పీ నుంచి సీహెచ్.వాసు, బీజేపీ నుంచి ఆర్.భాస్కరరావు, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, కాంగ్రెస్ నుంచి డి.బాలాస్వామి, సీపీఎం నుంచి షేక్ ఖాసిం షాహెద్ పాల్గొన్నారు.

### మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

**తెనాలిరూరల్:** నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ మార్కెట్ ఏరియలో ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఓ వ్యక్తి బుధవారం 10 క్వార్టరు సీసాలు కొనుగోలు చేసి వెళుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. నిందితుడిని కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన గిడుగు కోటేశ్వరరావుగా గుర్తించారు.